

'ఆసరా' కోసం ఎదురుచూపులు

- ఓపెన్ కాని వెబ్‌సైట్
- నెలల తరబడి కొత్త పెన్షన్ల కోసం పడిగాపులు

కరీంనగర్ టౌన్, జూన్ 14: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, గీతకార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా పెన్షన్ అందిస్తూ గత ప్రభుత్వం ఆసరా పథకానికి శ్రీకారం చుట్టింది. ఆయా వర్గాలకు ప్రతినెలా ఇస్తున్న డబ్బులతో వారు ఎవరిపై ఆధారపడకుండా జీవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆసరా పెన్షన్లను పెంచడమే కాకుండా ప్రతినెలా ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నట్లుగా పెన్షన్ డబ్బులను ఒకటో తారీఖునుంచి రెండు, మూడురోజులు అటు ఇటుగా ఇస్తామని చెప్పింది. పార్లమెంట్ ఎన్నికల వరకు మొదటి వారంలోనే పెన్షన్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. ఈనెల (జూన్-15) 15వ తేదీ వచ్చినా ఇప్పటి వరకు వారికి ఆసరా పెన్షన్ డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయలేదు. దీంతో ఆసరా డబ్బులపైనే ఆధారపడి జీవిస్తున్న ఎంతో మంది లబ్ధిదారులు పెన్షన్ డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. మొన్నటి వరకు ఒకటి నుంచి ఐదో తేదీలోపు పెన్షన్ డబ్బులు వేశారు కదా ఇప్పుడు ఎందుకు వేయడం లేదని నిట్టూరుస్తున్నారు.



● జిల్లాలో 1.37 లక్షల మంది లబ్ధిదారులు

జిల్లాలో 1,37,709 మంది ఆసరా లబ్ధిదారులున్నారు. వీరిలో వృద్ధాప్య పింఛన్లు 56,510, వితంతు పెన్షన్లను 37,991, దివ్యాంగులు 23,429, నేత కార్మికులు 2,813 మంది ఆసరా పెన్షన్ పొందుతున్నారు. గీతకార్మికులు 3,850, బీడీ కార్మికులు 9,.582, ఒంటరి మహిళలు 3,481, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు 53 మంది నెలనెలా పెన్షన్లను పొందుతున్నారు. వీరంతా పెన్షన్ డబ్బుల కోసం వారి సమీపంలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, తహసీల్దార్ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పెన్షన్ డబ్బులు వస్తేనే ఇల్లు గడుస్తుందని, పెన్షన్ రాకుంటే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆసరా పెన్షన్లను ప్రతి నెలా ఒకటో తారీఖున ఇవ్వాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ మొత్తాన్ని పెంచాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

● 57 ఏళ్లకు పెన్షన్ ఇచ్చేదెప్పుడు?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆసరా పెన్షన్ల వయోపరిమితి వయస్సును 57 ఏళ్లకు తగ్గిస్తున్నామని ప్రకటించింది. కొద్దిరోజులు ఆన్‌లైన్‌లో అర్హత ఉన్న వారి నుంచి దరఖాస్తులను స్వీకరించింది. వాటిని పరిశీలించిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులైన వారిని ఎంపిక చేసి పెట్టారు. ఆ వివరాలను అప్‌లోడ్ చేసేందుకు ఆన్‌లైన్‌లో సైట్ ఓపెన్ కాక పోవడంతో వాటిని అటకెక్కించారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం 57 ఏళ్లకు ఆసరా పెన్షన్లు ఇస్తుందో, లేదో అని స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఆరు మాసాలుగా అర్హులైన దరఖాస్తుదారులు పెన్షన్లకోసం పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టత ఇచ్చి అర్హులైన వారికి పెన్షన్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరుతున్నారు.



కలెక్టరేట్‌లో కుక్కల సమూహం



కుక్కలు బాబోయ్..

- కలెక్టరేట్‌లో శునకాల స్వైరవిహారం
- తహసీల్దార్‌సహా 14 మందిపై దాడి

కరీంనగర్ టౌన్, జూన్ 14: నిత్యం రద్దీగా ఉండే కలెక్టరేట్ ప్రాంగణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలు, కోతుల బెడద నుంచి తమను రక్షించాలంటూ పలువురు బాధితులు కలెక్టర్‌కు వచ్చి కలెక్టర్‌తో మొరపెట్టుకోవడం చూశాము.. శుక్రవారం కలెక్టర్ చాంబర్ ఎదుట ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో అధికారులు, ఉద్యోగులు, సందర్శకులు భయాందోళనకు గురయ్యారు. కలెక్టర్ చాంబర్ ఎదుట తహసీల్దార్‌సహా 14 మందిపై దాడిచేసి గాయాలపాలు చేసింది. శుక్రవారం కలెక్టర్ పమేలాసత్పతి తన చాంబర్‌లో తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్లు, అధికారులు హాజరయ్యారు. ఇదే సందర్భంలో కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన సందర్శకులు చాంబర్ ముందు వేచి ఉన్నారు. ఈ సమయంలో అటుగా పిచ్చికుక్క వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో గాయపడ్డ బాధితులు ఆ కుక్కను కర్రలతో దాడి చేసి కొట్టడంతో తీవ్రంగా గాయాలపాలయింది. ఆ తర్వాత నగరపాలక సంస్థ డీఆర్ఎస్ సిబ్బందికి సమాచార మందించడంతో వారు ఆ కుక్కను అక్కడి నుంచి తీసుకెళ్లారు. కలెక్టరేట్ ఆవరణలో మరోవైపు కొత్తగా కలెక్టర్ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ భవనంతోపాటు పచ్చిక బయళ్ళు, గ్రౌండ్‌లో కుక్కల గుంపు ఉన్నప్పటికి వాటిని పట్టించుకోక పోవడంతో పలుమార్లు సందర్శకులు, ఉద్యోగులపై దాడి చేస్తున్నాయి. శుక్రవారం తహసీల్దార్‌తో సహా 14 మందిని గాయపరచడం కలకలం రేపింది. దీంతో కలెక్టర్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని కుక్కలను అక్కడి నుంచి తరిమివేయాలని ఆదేశం చినట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లోని కుక్కల బెడద లేకుండా చేయాలని ప్రజలు కలెక్టర్‌ను కోరారు.

రూ. 10,182.7 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక

- ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలి..
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, జూన్ 14: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 10,182.7 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ పమేలా సత్పతి విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాం కర్లతో రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, రికవరీ, పీఎం జీపీవై రుణాలు, ఎస్సీ బీసీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖలతోపాటు పలు పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై డీసీసీ, డీఎల్ఆర్సీ సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళికకు సంబంధించిన బుక్‌లెట్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అవసరాల కోసం 3673.92 కోట్లు, ఎంఎస్ఎంఈ కింద 2997.06 కోట్లు, విద్యా రుణాలు 44.55 కోట్లు, గృహ రుణాలు 192.00 కోట్లు, ఇతర రంగాలకు గానూ రూ.3275.17 కోట్ల రుణాలను అందించాలని బ్యాంకర్లు ఆదేశించారు. జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు రుణాలు అందించేందుకు బ్యాంకర్లు పూర్తి స్థాయిలో సహక రించాలని కోరారు. వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి వంద శాతం లక్ష్యసాధనకు బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బ్యాంకర్లు వినియోగదారులు, రైతులకు అత్యుత్తమంగా సేవలందించాలన్నారు. రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పధానమంత్రి ఫార్మలైజేషన్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎం ఎఫ్ఎంఈ) పథకం కింద జిల్లాలో 210 యూ నిట్లను గ్రౌండింగ్ చేశామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న లక్ష్యాల్లో 133.04 శాతం పూర్తయిందని, పెండింగ్ లో ఉన్న రుణాల ప్రతిపాదనలు సైతం బ్యాంకర్లకు అందించి త్వరగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువతకు ఉపాధి అందించే విషయంలో అధికారులు చొరవ చూపాలని సూచించారు. బ్యాంకర్లు నియమ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో పవన్‌కుమార్, ఎల్డీఎం ఆంజనేయులు, జిల్లా వ్యవసాయ అధికారి బి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్, డీఆర్డీవో శ్రీధర్, మెప్మా ఇన్చార్జి పీడీ స్వరూపారాణి, జిల్లా సహకార అధికారి రామానుజా చార్యులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, ఆర్బీఐ అధికారి పల్లవి, నాబార్డ్ డీడీఎం దిలీప్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

ధరణి, ప్రజావాణి దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

కరీంనగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాల్లో ధరణి, ప్రజావాణి కార్యక్రమాల ద్వారా వచ్చే ఫిర్యాదులు, దరఖాస్తులపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి కలెక్టరతో పెండింగ్ ధరణి, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, భూముల మార్కెట్ విలువలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులు, మ్యూటేషన్ల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వారీగా ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఆదేశించారు. ప్రతిరోజు వచ్చే దరఖాస్తులను కలెక్టర్లు సమీక్షించాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూ సంబంధిత సమస్యలను కలెక్టర్లకు బదిలీ చేస్తామని, వీటిని అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని, దీని కోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదికను అందించాలన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాయాల ఏర్పాటుకు జిల్లాలోని హుజూరాబాద్, గంగాధరలో అనువైన భవనం లేదా భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి త్వరగా ఫైల్స్ డిస్పోజ్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. హుజూరాబాద్, గంగాధరలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు భవనం లేదా స్థలాన్ని గుర్తిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడిషన్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్ కుమార్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

- ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి మంజులత



చిరు సంచులు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

భగత్‌నగర్, జూన్ 14: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ పరిశోధనస్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి మంజులత అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణరాష్ట్ర వ్యవసాయ విద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలంలోని నాగుల మల్యాల, బద్దిపల్లి రైతు వేదికలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ఇన్‌చార్జి డాక్టర్ జి ఉషారాణి, శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం గ్రామంలోని కట్ల ప్రభాకర్‌కు చెందిన పచ్చి రొట్ట ఎరువుగా వేసిన పెసరపంటను సందర్శించారు. ఆసక్తి గల రైతులకు చిరు సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కరీంనగర్ సమన్వయ కర్త డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, పి మధుకర్‌రావు, రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి, గ్రామ ప్రత్యేకాధికారి రంజిత్, వ్యవసాయ విస్తరణ అధికారి లలిత, రైతులు పాల్గొన్నారు.

మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందేనా..?

- లింక్ కాల్వల నిర్మాణం జరిగేనా..
- దశాబ్దాలుగా నీటికోసం ఎదురుచూపులు

చొప్పదండి, జూన్ 14: కాళేశ్వరం ప్రాజెక్టుకు కీలకమైన గాయత్రి పంపుహౌస్‌కు కిలోమీటర్ దూరంలో ఉన్న ఆ చెరువులో మాత్రం చుక్క నీరు లేదు. చొప్పదండి మండలంలో మెట్ట గ్రామాలకు నీటిని అందించే పథకం పురోగతిలో లేకపోవడంతో దశాబ్దాలుగా ప్రజలు సాగునీటి కోసం ఇబ్బందిపడుతున్నారు. గుమ్లాపూర్, కాట్నపల్లి, మంగళపల్లి, చిట్యాలపల్లి, సాంబయ్యపల్లి, మల్లన్నపల్లి గ్రామాలు చొప్పదండి మండలంలో మెట్ట ప్రాంతాలుగా ఉన్నాయి. కాకతీయ కాలువకు ఎగువన, వరద కాలువకు దిగువన ఉన్న ఈ గ్రామాల కోసం 30 ఏళ్ల క్రితం మోతె రిజర్వాయర్‌ను ప్రతిపాదించారు. మోతె రిజర్వాయర్‌ను రద్దు చేసి గత ప్రభుత్వం వరద కాలువకు నాలుగు ఉప కాలువలను నిర్మించి నియోజకవర్గంలోని చొప్పదండి, రామడుగు, గంగాధర మండలంలోని పలు గ్రామాలకు నీరందించేందుకు ప్రణాళికను ఏర్పాటు చేశారు. 255 కోట్లను మంజూరు చేసి 2019లో శంకుస్థాపన చేశారు. కాల్వల నిర్మాణం కోసం మండలంలో 58 ఎకరాల భూమిని సేకరించారు. పనులను ఇప్పటికీ ప్రారంభించలేదు. మండలంలోని గుమ్లాపూర్, కాట్నపల్లితోపాటు ఇతర గ్రామాలకు వరదకాలువ నుంచి 10 కిలోమీటర్ల కాల్వల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.



చుక్క నీరు లేని గుమ్లాపూర్ చెరువు(ఫైల్)

● కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు...

255 కోట్ల రూపాయలతో చేపట్టే సాగునీటి పథకం పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోగా ఈ ప్రాంత ప్రజలు కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. 10 కోట్లతో లిఫ్టు పథకం చేపట్టి చెరువులు నింపాలని రైతులు కోరుతున్నారు. గతంలో సాగునీటి కోసం 2019లో చొప్పదండిలో గుమ్లాపూర్ గ్రామస్థులు మహాధర్నా చేపట్టారు. అనేక గ్రామాల్లో ఆందోళన నిర్వహించారు. దశాబ్దాల కల ఎప్పటికి నెరవేరుతోందనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పనులను ప్రారంభించి సాగునీటిని అందించాలని మెట్ట ప్రాంతాల రైతులు కోరుతున్నారు.

● లిఫ్టుతో నీటిని అందించవచ్చు...

గాయత్రి పంపుహౌజ్ నుంచి కిలోమీటర్ దూరంలో గుమ్లాపూర్ గ్రామ శివారులో పిల్లగుట్ట వద్దకు నీటిని లిఫ్టు చేసి ఆ తర్వాత గుమ్లాపూర్‌లోని మూడు చెరువులు, సాంబయ్యపల్లి, కాట్నపల్లి, మల్లన్నపల్లి గ్రామాల్లోని చెరువులను నింపవచ్చు. ఈ పథకానికి 10 కోట్ల రూపాయల ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేసి అప్పట్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఎలాంటి ఫలితం లేకుండా పోయింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 14: ఆత్మహత్యకు యత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివరాత్రి సమ్మయ్య(42) గురువారం రాత్రి మృతి చెందాడు. కాలనీ షిర్కే సులబ్ కాంప్లెక్స్ కార్మికుడిగా పనిచేస్తున్న సమ్మయ్య ఆర్థిక ఇబ్బందులను మానసిక క్షోభతో మద్యానికి బానిస అయ్యాడు. ఈక్రమంలో గురువారం తెల్లవారు జామున ఆత్మహత్య చేసుకోవాలని సులబ్ కాంప్లెక్స్ శుభ్రతకు వాడే యాసిడ్‌ను తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 సాయంతో గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందతూ గురువారం రాత్రి సమ్మయ్య మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్స్‌లో రెవెన్యూ అధికారుల తనిఖీ

- 14 డొమెస్టిక్ సిలిండర్లు పట్టివేత

ధర్మపురి, జూన్ 14: ధర్మపురి పట్టణంలోని పలు హోటల్స్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వెంకటేష్, రాజేంద్రప్రసాద్, మల్యాల డీటీసీఎస్ శ్రీనివాస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోటల్ యజమానుల వద్ద నుంచి 14 డొమెస్టిక్ సిలిండర్లను పట్టుకున్నారు. అనంతరం డొమెస్టిక్ సిలిండర్లు కలిగి ఉన్న యజమానులపై 6ఏ కేసు నమోదు చేశారు. అనంతరం ఆర్ఐ వెంకటేష్ మాట్లాడుతూ సబ్సిడీపై గృహ అవసరాలకు ఇచ్చే సిలిండర్లను వాణిజ్యపరమైన అవసరాలకు వినియోగించడం నేరమని అన్నారు. వాణిజ్య అవసరాలకు ప్రత్యేకమైన సబ్సిడీ లేని సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీల నుంచి తీసుకొని వాడుకోవాలని హోటల్ నిర్వాహకులకు ఆయన సూచించారు.

వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్య

- సూసైడ్ నోట్ లభ్యం

ఇబ్రహీంపట్నం, జూన్ 14: అప్పు ఇవ్వకుండానే ఇచ్చినట్లు రాయించుకుని నిరంతరం వేధింపులకు పాల్పడటంతో భరించలేక మండల కేంద్రానికి చెందిన సున్నం రవి (42) అనే వ్యక్తి శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలంలో రవి జేబులో లభ్యమైన సుసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఇబ్రహీంపట్నంకు చెందిన రెబ్బటి రాజేందర్ అనే వ్యక్తి రవికి రెండు లక్షల రూపాయలు అప్పుగా ఇవ్వకుండానే ఇచ్చినట్లు బెదిరించి కొట్టి సంతకం తీసుకున్నాడు. అదే విధంగా గ్రామానికి చెందిన కనక జగన్, చెప్పుల శ్రీనివాస్, గంట గణేష్‌లు రవి వద్ద అప్పులు తీసుకుని చెల్లించడం లేదు. డబ్బులు అడిగినప్పుడల్లా చంపుతామంటూ రవిని బెదిరిస్తూ వస్తున్నారు. ఓ వైపు రవి ఇప్పుగా ఇచ్చిన డబ్బులు రాకపోవడం, మరోవైపు అప్పు తీసుకోకున్నా డబ్బులు చెల్లించాలంటూ రాజేందర్ నుంచి వేధింపులు పెరగడంతో రవి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు.

ఈ క్రమంలో చేసేది లేక చివరికి సూసైడ్ నోట్ రాసి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. రవికి ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు. రవి మృతితో గ్రామంలో విషాదం నిండుకుంది. రవి మృతికి కారుకులైన వారి చట్టపరంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

కుక్కల దాడిలో ఐదుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 14: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి శుక్రవారం సాయంత్రం ఇంటికి వెళుతున్న ఐదుగురు విద్యార్థులపై రెండు కుక్కలు దాడి చేశాయి. ఈ సంఘటనలో విద్యార్థులు వర్ష, రమేశ్, ప్రవళికతో పాటు మరో ఇద్దరు విద్యార్థులు తీవ్ర గాయాలపాలయ్యారు. అక్కడే ఉన్న వ్యక్తులు అప్రమత్తమై కుక్కలను కర్రలతో వెళ్లగొట్టడంతో పారిపోయాయి. క్షతగాత్రులను స్థానిక ఓ పీఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని ప్రజలు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శునకాల బారి నుంచి తమతో పాటు పిల్లలను రక్షించాలని తల్లిదండ్రులు కోరారు.

ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీ

- యువకుడి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు


అజయ్(ఫైల్)

రుద్రంగి, జూన్ 14: ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి ఈ సంఘటన రుద్రంగి మండల కేంద్రం శివారులోని కలిగోట తండా మూలమలుపు వద్ద శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన బిల్లవేణి (గండి) గంగాధర్ - రాయమల్లు దంపతుల కుమారుడు గండి అజయ్(19) అనే యువకుడు, ఇదే గ్రామానికి చెందిన బోయిని అభిషేక్ అనే యువకుడితో కలిసి కథలాపూర్ మండలానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి రుద్రంగి వస్తున్న సమయంలో రుద్రంగి శివారులోని కలిగోట తండా మూలమలుపు వద్ద రుద్రంగి నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో బైక్ నడుపుతున్న బోయిని అభిషేక్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెనుకాల కూర్చున్న గండి అజేయ్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన అభిషేక్‌ను చికిత్స కోసం వేములవాడ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సిరిసిల్ల అశోక్ పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

● **బోనాల పండగ పూట విషాదం..**

పెద్దమ్మ బోనాల పండగ పూట ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. పండగ పూట పని నిమిత్తం వెళ్లిన యువకులు తిరిగి వస్తున్న క్రమంలో రుద్రంగి శివారులో మూలమాలుపు వద్ద ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో అజయ్ అక్కడికక్కడే మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. పండగ పూట సంతోషంగా ఉండాల్సిక కుటుంబం ఒక్కగానొక్క కూమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు ముందు భాగం, చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఆర్టీసీ బస్సు.. వ్యాన్ ఢీ

- ఐదుగురికి తీవ్రగాయాలు

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం నేరెళ్ల శివారులో ఆర్టీసీ బస్సు, వ్యాన్ శుక్రవారం ఢీకొనడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరబాద్ నుంచి సుమారు 20 మంది ప్రయాణికులతో వేములవాడకు వెళ్తుండగా నేరెళ్ల శివారులో ప్రమాదకరమైన మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ మక్బుల్ (55), సిరిసిల్లకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఇంద్రసేనారెడ్డి (46), బస్సులో ప్రయాణికులు కథలాపూర్ మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన వైశాలి (18), గంభీరావుపేటకు చెందిన శశాంక్ (33), వేములవాడకు చెందిన పుల్కం లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 వాహనంలో జిల్లా ప్రధాన అసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మధ్యాహ్నం వర్షం కురుస్తుండగా నేరెళ్ల శివారులోని ప్రమాదకరమైన మూలమలుపు వద్దకు సుమారు 20 మంది ప్రయాణికులతో బస్సు చేరుకోగానే అతివేగంగా ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొట్టడంతో సుమారు యాభై మీటర్ల వరకు బస్సును నెట్టుకుంటూ వెళ్లగా చెట్టును ఢీకొట్టి ఆగిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చెట్టును ఢీకొని బస్సు ఆగడంతో పెను ప్రమాదం తప్పిందని లేకుంటే బస్సు బోల్తా పడేదని సత్యనారాయణ అనే ప్రయాణికుడు తెలిపాడు. సంఘటన స్థలానికి డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● **తరుచూ ప్రమాదాలు..**

సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై ప్రమాదకరమైన మూలమలుపులు చాలా ఉన్నాయి. మూలమలుపుల్లో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదకరమైన మూల మలుపులు ప్రయాణికుల పాలిట శాపంగా మారాయి. మూలమలుపుల వద్ద రోడ్డు వెడల్పు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మావోయిస్టు దంపతుల లొంగుబాటు


లొంగిపోయిన మావోయిస్టు దంపతులకు రివార్డు అందజేస్తున్న సీపీ అభిషేక్ మోహంతి

కరీంనగర్ క్రైం, జూన్ 14 సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు పార్టీకి చెందిన ఏరియా కమిటీ సభ్యులు తిక్క సుష్మిత అలియాస్ చైతె, మడకం దూల అలియస్ దూల శుక్రవారం పోలీసులకు లొంగిపోయారు. వీరిద్దరు దంపతులు. ఈ మేరకు వరంగల్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి కరీంనగర్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. సెంట్రల్ కమిటీ మెంబర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇన్‌చార్జి వద్ద సుష్మిత సెంట్రల్ కమిటీ స్టాఫ్‌గా, దూల ప్రొటక్షన్ టీం మెంబర్‌గా పని చేశాడని సీపీ తెలిపారు. హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సుదంపల్లి గ్రామానికి చెందిన తిక్క సుష్మిత(27) ఇంటర్మీడియేట్ వరకు చదువుకుంది. ఆమె తండ్రి తిక్క సుదాకర్ మావోయిస్టు సానుభూతి పరుడిగా పనిచేశాడు. తండ్రిని చూసి మావోయిస్టు పార్టీకి ఆకర్షితులరాలైన సుష్మిత తన చదువు అనంతరం 2016వ సంవత్సరంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కొమటిపల్లి గ్రామం అటవీ ప్రాంతంలో బడె చొక్కారావు అలీయాస్ దామోదర్ సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా పర్య గ్రామానికి చెందిన మడకం దూల ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. ఆయన సోదరుడు ఐయేత 2008లో సీపీఐ మావోయిస్టు పార్టీలో చేరాడు. అతడిని చూసి ఆకర్షితుడైన దూల 2015లో ఏరియా కమిటీ మెంబర్ అయిన జోగి ప్రోత్సాహంతో మావోయిస్టు పార్టీలో చేరాడు. మావోయిస్టు పార్టీలో చేస్తున్న సమయంలో సుష్మిత, దూలల మధ్య పరిచయం ఏర్పడి 2020 మార్చి30న వివాహం చేసుకున్నారు. తరువాత వివిధ హోదాల్లో మావోయిస్టు పార్టీలో పని చేశారు. మావోయిస్టు సిద్ధాంతాలపై నమ్మకం కోల్పోయి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకం గురించి తెలుసుకుని ఆకర్షితులై లొంగిపోయారని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. ఒక్కొక్కరిపై నాలుగు లక్షల రూపాయల రివార్డు ఉందని చెప్పారు. ఆ మొత్తాన్ని మావోయిస్టు దంపతులకు సీపీ బ్యాంకు డీడీ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులు అజ్ఞాతం వీడి, హింసను వదిలి పెట్టి సమాజంలో కలిసిపోయి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పి తిరుమల్, హసన్‌పర్తి సీఐ జె సురేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లందకుంట, జూన్ 14: మండలంలోని బూజూనూర్ గ్రామ శివారులో మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రాజకుమార్ శుక్రవారం తెలిపారు. జమ్మికుంట మానేరు పరివాహక ప్రాంతం నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇల్లందకుంట మండలంలోని బూజూనూర్ గ్రామం గుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

మల్యాల, జూన్ 14: మండలంలోని కొండగట్టు, బల్వంతాపూర్ శివారులో నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్ రహీం శుక్రవారం తెలిపారు. వాహనాల యజమానులు మురళి, రవీందర్ డ్రైవర్లు కోను మహేష్, శివరాత్రి లక్ష్మణ్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గత మంగళవారం కూడా అక్రమంగా మట్టి తరలిస్తున్న అయిదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినప్పటికీ మట్టి అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది.

డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడపాలి

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం

భగత్‌నగర్, జూన్ 14: డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులను నడిపించాలని, ఆర్టీసీ డ్రైవర్లకు అనుభవజ్ఞులైన డ్రైవర్లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం అన్నారు. ప్రతి త్రైమాసికంలో ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందించడంతో డ్రైవర్లకు ఉత్తేజం కలుగుతుందన్నారు. కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి వినోద్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ జోన్‌కు ఎంతో చరిత్ర ఉందని, రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. సిబ్బంది కృషి ఫలితంగానే సాధ్యమవుతుందన్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి ఎంతో పేరు వచ్చిందన్నారు. కరీంనగర్ జోన్‌కు ప్రతి రోజు 5.05 కోట్లు లక్ష్యం కాగా ప్రతిరోజు 5.14 కోట్లు ఆర్జిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో డీలక్స్ ఆపై సర్వీసులలో ఆదాయాన్ని పెంపొందించుకొనుటకు కృషి చేయాలన్నారు. ప్రతి డ్రైవర్ ఏకాగ్రతతో బస్సులను నడిపించాలన్నారు. సెల్‌ఫోన్ వాడరాదని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత ప్రతి డ్రైవర్‌పై ఉందన్నారు. రీజినల్ మేనేజర్ సుచరిత మా ట్లాడుతూ ఉత్తమ ప్రతి కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లు గ్యారేజీ సిబ్బంది సూపర్‌వైజర్లకు ప్రగతిచక్ర అవార్డులు అందించడం జరుగుతుందన్నారు. అవార్డులు సాధించిన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. 3వ త్రైమాసికంలో 60 మంది ఉద్యోగులకు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెకానికల్) కె సత్యనారాయణ, (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎం చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, రీజియన్‌లోని అన్ని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్, మెకానికల్ సూపర్‌వైజర్లు, సేఫ్టీ వార్డెన్స్ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్లు, వెల్‌ఫేర్ బోర్డు కమిటీ సభ్యులు, రీజినల్ మేనేజర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అవార్డులు అందుకున్న ఉద్యోగులతో ఆర్టీసీ అధికారులు

ప్రభుత్వ అంధుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

కరీంనగర్ టౌన్, జూన్ 14: జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట గల ప్రభుత్వ అంధుల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను 1 నుంచి ఐదో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం, 1 నుంచి పదో తరగతి వరకు తెలుగు మీడియంలో విద్యాబోధన చేయడంతో పాటు ఉచితంగా భోజన వసతి కూడా కల్పిస్తామని చెప్పారు. అలాగే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో రూపొందించిన కంప్యూటర్, వివిధ కళల్లో కూడా విద్యార్థులకు శిక్షణ అందిస్తామని అన్నారు. ఆరు నుంచి 14 ఏళ్ల వయసు కలిగిన బాలబాలికలు ఈ పాఠశాలలో ప్రవేశం తీసుకోవచ్చని అన్నారు. మెడికల్ బోర్డు జారీ చేసిన సదరం సర్టిఫికెట్‌లో 40 నుంచి 100శాతం అంధత్వం కలిగిన విద్యార్థులకు మాత్రమే అర్హత ఉంటుందని తెలిపారు. కరీంనగర్ జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన అంధ విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఉపాధ్యాయులు, సర్పంచ్‌లు, గ్రామకార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను కోరారు. ఇతర వివరాలకు ఫోన్: 9494317315, 9701190124, 7396206959, 944033 8424 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య

సుల్తానాబాద్, జూన్ 14: సుల్తానాబాద్ రైస్‌మిల్లుల ప్రాంతంలో ఆరేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన అమానుషమైన ఘటన చోటుచేసుకుంది. సుల్తానాబాద్-కాట్నపల్లి మధ్య రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న ఓ రైస్‌మిల్లులో పని చేయడానికి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన చెందిన దంపతులు వారం రోజుల క్రితం వచ్చారు. వారికి ఆరేళ్లు, ఏడాది వయస్సుగల ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గురువారం రైస్‌మిల్లుకు చెందిన లేబర్ రూముల్లో కరెంట్ పోవడంతో ఉక్కపోత భరించలేక తమ ఇద్దరు చిన్నారులతో సహా గది ముందు భాగంలో నిద్రపోయారు. కొంతసేపటి తర్వాత తమ పెద్ద కూతురు కనిపించకపోవడంతో చిన్నారి తల్లి విషయాన్ని భర్తకు తెలిపింది. అతడు మిల్లులోని తోటి కార్మికులతో కలిసి మిల్లుతోపాటు చుట్టుపక్కల వెతుకుతూ డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ వ్యక్తి చిన్నారిని భుజాన వేసుకుని వెళుతున్న దృశ్యాలు కనిపించాయి. అప్పటికే పోలీసులు గాలిస్తుండగా చిన్నారి అపహరణకు గురైన మిల్లును ఆనుకుని ఉన్న మరో మిల్లులో తెల్లవారుజామున దుస్తులు ఉతుకుతూ ఓ కార్మికుడు కనిపించాడు. కార్మికులు, పోలీసులు అతడిని విచారించడంతో నిందితుడని తేలింది. అతడు ఈనెల 6న మిల్లులో పనికి చేరాడని తోటి కార్మికులు తెలిపారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా, మిల్లు వెనక వైపు చెట్ల పొదల్లో అత్యాచారం చేసి, హత్య చేసినట్లు తేలిపాడు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

● **ఘటనా స్థలానికి పోలీస్ ఉన్నతాధికారులు**

చిన్నారిపై అత్యాచారం, హత్య చేసిన కేసుకు సంబంధించిన ఘటనా స్థలాన్ని రామగుండం కమిషనరేట్ పరిధిలోని పలువురు ఉన్నతాధికారులు పరిశీలించారు. పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు సుల్తానాబాద్‌కు చేరుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● **నిందితుడి అరెస్టు**

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని ఓ రైస్ మిల్లులో బీహార్ రాష్ట్రానికి చెందిన నిందితుడు హమాలీగా పని చేస్తున్నాడని పేర్కొన్నారు. గురువారం రాత్రి కరెంట్ పోవడంతో నేరస్తుడు బయటకు వచ్చి బాలిక, తల్లిదండ్రులు రూమ్ బయట పడుకున్న విషయాన్ని గమనించాడన్నారు. చిన్నారిని అక్కడి నుంచి ఎత్తుకెళ్లి రైస్‌మిల్లు వెనుక ప్రాంతంలో అత్యాచారం చేసి చంపి పారిపోయాడని పేర్కొన్నారు. స్థానికుల సమాచారంతో సుల్తానాబాద్ పోలీసులు పట్టుకున్నారని ప్రకటనలో పేర్కొన్నారు.

మూగ యువతిపై అత్యాచారం

సంఘటనాస్థలిని పరిశీలించిన డీఎస్పీ, సీఐ

గొల్లపల్లి, జూన్ 14: గొల్లపల్లి మండలంలోని ఓగ్రామంలో మూగ యువతి (21)పై అత్యాచారం జరగగా, సంఘటనా స్థలాన్ని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై చిర్ర సతీష్ కుమార్ పరిశీలించి నిందితుడిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వికలాంగురాలైన యువతిని తీసుకుని శ్రీనివాస్ అనే యువకుడు పనుల నిమిత్తం గొల్లపల్లి మండల కేంద్రానికి తన ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి తిరిగి వస్తున్నారు.

ఈ క్రమంలో గోవిందుపల్లె రెవెన్యూ శివారులోని ఓ మామిడితోటలోకి యువతిని బలవంతంగా తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో బాధిత యువతి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గాలివాన బీభత్సం

- విరిగిన చెట్లు - లేచిపోయిన రేకుల షెడ్లు


జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారిపైకి వంగిన చెట్టు

గొల్లపల్లి, జూన్ 14: గొల్లపల్లి మండలంలో భారీ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన శుక్రవారం బీభత్సంను సృష్టించింది. సుమారు గంటపాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంబించింది. పలు గ్రామాల్లో ఈదురుగాలుల తాకిడికి చెట్లు నేలకు విరిగిపడగా, పలువురు నిరుపేదలకు చెందిన రేకుల షెడ్లు కొట్టుకుపోయి నిరాశ్రయిలయ్యారు. పలుచోట్ల చెట్లు రోడ్డు విరిగిపడ్డంతో వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. మరికొన్ని చోట్ల రోడ్ల పై చెట్లు విరిగిపడ్డంతో వాహనాదారులకు ప్రమాదభరితంగా మారాయి. భారీ వర్షానికి పలుచోట్ల రోడ్లు జలమయం కాగా, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. ఉరుములు, మెరుపులతో కూడిన గాలివానకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇదిలా ఉండగా, మండలంలో తొలకరి పలకరింపుతో రైతన్నల మోము పులకరించింది. వేసవి కాలం భానుడి భగభగలతో, తీవ్ర ఉక్కపోతతో సతమైన జనం ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడడంతో జనాలకు ఉపశమనం లభించినట్లయింది.

చందుర్తి: చందుర్తి మండలం ఎనగల్, మరిగడ్డ, నర్సింగాపూర్, మూడపల్లి గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఎనగల్, మూడపల్లిలో భారీ వర్షం కురిసింది. గాలివానకు పలు చోట్ల రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి.

పిడుగుపాటుకు గేదె మృతి..

మండలంలోని ఎనగల్ గ్రామంలో పాడి రైతు పకిడే రాజయ్యకు చెందిన గేదే పిడుగుపాటుకు మృతి చెందింది. ఎల్లమ్మ ఆలయ సమీపంలోని చెట్టు వద్ద గేదెని కట్టివేయగా పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ దాదాపు రూ. 50 వేల వరకు ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కొడిమ్యాల: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి, శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలి వీయటంతో మండలంలోని సంద్రల్లపల్లి గ్రామానికి చెందిన మర్రిపల్లి శంకర్ పశువుల కొట్టం కూలింది, పైకప్పు లేచి పక్కన ఉన్న ఇంటిపై పడింది. దీంతో ఇంటిలోని చిందరవందరగా మారాయి. సుమారు రెండు లక్షల రూపాయల నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బీర్‌పూర్,జూన్ 14: మండల కేంద్రంలోని రోళ్ల వాగు సమీపంలో శుక్రవారం సగం కాలిన స్థితిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం అయ్యింది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి సిబ్బందితో చేరుకున్న జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఆనవాళ్ల కోసం చుట్టు పక్కల ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహం సగానికిపైగా కాలిపోయి ఉండటంతో వ్యక్తి ఎవరు అనేది గుర్తించడం కష్టంగా మారింది. గుర్తుతెలియని వ్యక్తిని హత్య చేసి మృతదేహాన్ని కాల్చి ఉంటారా లేదా ఎవరైనా ఆత్మహత్య కు పాల్పడి ఉంటారా అన్నసందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

వ్యక్తిపై కేసు నమోదు

పాలకుర్తి,జూన్ 14: మండలం పరిధిలోని కన్నాల గ్రామానికి చెందిన పుట్ట రంజిత్‌పై కేసు నమోదైంది. ఇటీవల రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్‌పై, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై సోషల్ మీడియాలో రంజిత్ అనుచిత వ్యాఖ్యలు చేశాడని భూతగడ్డల రమేష్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పుట్ట రంజిత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు.

గ్రానైట్ క్వారీ వద్ద వృద్ధుడి అనుమానాస్పద మృతి

● మృతదేహంతో గ్రామస్థుల ఆందోళన
● రూ.6లక్షలు చెల్లించిన క్వారీ యాజమాన్యం

మల్యాల, జూన్ 14: మండలంలోని బల్వంతాపూర్ గ్రామ శివారులో గల గ్రానైట్ క్వారీ వద్ద ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి తలపై గాయాలు ఉండడంతో మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ గ్రానైట్ క్వారీ వద్ద మృతదేహంతో గ్రామస్థులు ఆందోళన చేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బల్వంతాపూర్‌కు చెందిన నెలబొయిన పర్శయ్య(65) గురువారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు రాగా అతని మృతదేహం గ్రామశివారులోని మారుతీ గ్రానైట్ క్వారీ వద్ద శుక్రవారం వేకువజామున కొందరు గుర్తించారు. దీంతో అక్కడి సిబ్బంది మృతి విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపారు. అక్కడకు చేరుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్థులు వృద్ధుడి మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. మృతుడి తలపై గాయాలు ఉండడంతో ఓపెన్ బ్లాస్టింగ్‌తో రాళ్లు ఎగిరిపడడంతోనే మృతి చెందాడని బ్లాసింగ్ సమయంలో నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదం చోటు చేసుకుందని గ్రామస్థులు మండిపడ్డారు. మృతదేహాన్ని బట్టి చూస్తే క్వారీలో జరిగిన ప్రమాదమేనని మృతుడి కుటుంబసభ్యులను ఆదుకోవాలని గ్రామస్థులు నక్క అనిల్, రమేష్ డిమాండ్ చేశారు. క్వారీ వద్ద రక్షణ చర్యలు లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని, రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో దాదాపు మూడు గంటల పాటు ఆందోళన చేశారు. మల్యాల సీఐ నీలం రవి, ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి అక్క డకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గ్రామస్థుల ఆందోళన నేపథ్యంలో క్వారీ యాజమాన్యం మృతుడి కుటుంబసభ్యులకు ఆరు లక్షల రూపాయలు చెల్లించ డంతో ఆందోళన విరమించినట్లు గ్రామస్థులు తెలిపారు. పర్శయ్య కొడుకు నరేష్ తన తండ్రికి కొన్నాళ్లుగా మతిస్థిమితం సరిగా లేదని అందులో భాగంగానే గురు వారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి వెళ్లగా క్వారీ వద్ద తలపై బండ పడడంతో గాయాలై మృతి చెందాడని తమకు ఎలాంటి అనుమానాలు లేవని పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోలీసులు జగిత్యాలకు తరలించారు.


ఆందోళన చేస్తున్న గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ

బేగంపేట్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులు


రామగిరి, జూన్ 14: మండలంలోని బేగంపేట్ గ్రామంలో గుడండా స్థావరాల పై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేపట్టారు. రామగుండం సిపి ఆదేశాల మేరకు గ్రామ శివారులోని కంచల చెరువు సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న గుడంబా స్థావరాలను గుర్తించారు. స్థావరాల్లోని వెయ్యి లీటర్లబెల్లం పానకం, సామాగ్రిని ధ్వంసం చేశారు. సీఐ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడులు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.7,250 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 14: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7250 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 12మంది రైతులు 130క్వింటాళ్లు విడి పత్తి, ముగ్గురు రైతులు రెండు క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7250, కనిష్ఠ ధర రూ.6500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. 15,16న సాధారణ సెలవు ధినాలు కాగా, 17న బక్రీద్, 18న ఉర్సు ఉత్సవాల జాతర సందర్భంగా మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించడం జరిగిందని, తిరిగి బుధవారం కొనుగోళ్లు ప్రారంభం అవుతాయని తెలిపారు.

మోదీ ప్రభుత్వంలో నేరారోపణలు ఉన్న మంత్రులు ఉండడం దారుణం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి, జూన్ 14: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వంలో ఇటీవల నియమించిన కేంద్ర మంత్రుల్లో నేరారోపణలు ఉన్న వారు ఉండడం దారుణమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ఇటీవల దేశంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ శాతం మంది అనేక అత్యాచారాలు, ఆర్థిక నేరాలకు పాల్పడిన వారు, ఇతర క్రిమినల్ కేసుల్లో 259 మంది నేరారోపణలు ఉన్నవారు ఎన్నికల్లో గెలిచారన్నారు. ప్రస్తుతం 18 మంది కేంద్ర మంత్రులు కూడా నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. దేశంలో మోదీ సొంత పాలన చేస్తూ 750 మంది రైతులను బలి తీసుకున్నారని ఆరోపించారు. అనేక ఉద్యమాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాసిన నియంత మోదీ అని అన్నారు. ఇప్పటికైనా రాజ్యాంగ ప్రకారం దేశ ప్రజలకు పాలన అందించి అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులను అందించాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్వమించిన విధంగా ప్రజాదర్బార్ నిర్వహించి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంతరెడ్డి ప్రజల మన్నలను పొందేలా కృషి చేయాలని అన్నారు. ప్రజాదార్బర్ ద్వారా ప్రజలతో, పాటు నాయకులను కలిసి అనేక ప్రజా సమస్యలను తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెళ్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, ముద్రకోల రాజయ్య, తెరాల సత్యనారాయణ, బూడిద సదాశివ, కంది రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇక 'విద్యుత్ ప్రజావాణి'

- ఎన్పీడీసీఎల్‌లో ప్రతీ సోమవారం నిర్వహణ

హనుమకొండ టౌన్, జూన్14: విద్యుత్ వినియోగదారులకు చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా వారి ఫిర్యాదులు తీసుకొని సకాలంలో పరిష్కరించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో ప్రతీ సోమవారం 'విద్యుత్ ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. ప్రతీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు 16 సర్కిళ్ల పరిధిలోని డివిజనల్ ఆఫీస్, సబ్‌డివిజనల్ ఆఫీస్, ఈఆర్వో సెక్షన్ ఆఫీస్‌లలో, అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్కిల్ ఆఫీసులో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. వినియోగదారులు చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేలా చూస్తామన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లోని పోర్టల్‌ను కన్స్యూమర్ రిసెప్షెన్ డెస్క్‌ల కు అనుసంధానం చేసి విద్యుత్ ప్రజావాణి అనే మరొక పోర్టల్‌ను ఏర్పాటు చేసి వినియోగదారులకు మరింత చేరువ చేస్తున్నామని సీఎండీ వెల్లడించారు.

విద్యుత్ ప్రమాదాలు అరికట్టేలా చర్యలు

గణేశ్‌నగర్,జూన్ 14: టీజీ ఎన్‌పీడీసీఎల్ పరిధిలో జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టామని టీజీఎన్‌పిడిసిఈఎల్ ఎస్‌ఈ గంగాధర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. భద్రత ప్రమాణాలు పాటించకపోవడం, నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలు వాడకపోవడం, అవగాహన లేక విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఉద్యోగులు భద్రత పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన పెంపొందించాలన్నారు. భద్రతపై విద్యుత్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు ఎస్‌ఈ తెలిపారు.

22న జూనియర్ లైన్‌మన్ ఎంపిక పరీక్ష

గణేశ్‌నగర్,జూన్ 14 : నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు టీజీ ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 22న ఏడోవిడత జూనియర్ లైన్‌మన్ పోస్టుల నియామక పరీక్షలు నిర్వహిస్తామని టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ గంగాధర్ తెలిపారు. జేఎల్‌ఎం అభ్యర్థులకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించడం జరిగిందన్నారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, పోలు ఎక్కించడం పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, జూన్ 14: నగరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల మెయింటెనెన్స్‌లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్‌వన్, టూటౌన్ ఏడీఈలు, సాయినేని నరేందర్, సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు ఉజ్వలపార్క్ సబ్‌స్టేషన్, అలకాపురి, ఎన్టీఆర్ విగ్రహం,కోతిరాంపూర్, గణేష్ నగర్, హనుమాన్‌నగర్, డోబీవాడ,కట్టరాంపూర్ ఏరియా,తిరుమలనగర్, వినాయకనగర్ , శ్రీనివాసనగర్, గౌతమినగర్, మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, తెలంగాణచౌక్, కాశ్మీర్‌గడ్డ, ముఖరంపుర,గోదాంగడ్డ, భగత్‌నగర్, సప్తగిరికాలనీ,రామచంద్రాపూర్ కాలనీ, శివనగర్, సంతోష్‌నగర్, భాగ్యనగర్, శక్తిదేవాలయం, విద్యానగర్, ఆదిత్యనగర్, బాలాజీ సూపర్ మార్కెట్ ఏరియా,జ్యోతినగర్, విజయదుర్గకాలనీ కొత్త లేబర్ అడ్డా, బ్యాంక్ కాలనీ, వావిలాలపల్లి, అంబేద్కర్ నగర్, టవర్ సర్కిల్ ,వాటర్‌వర్క్స్ (హౌసింగ్ బోర్డ్) సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని ఫీడర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఉట్కూర్ రాధాకృష్ణారెడ్డికి ఉత్తమ రక్తదాత అవార్డు



రాధాకృష్ణారెడ్డికి మెమెుంటోను అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సుభాష్‌నగర్, జూన్14: కరీంనగర్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రెటరీ ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి ఉత్తమ రక్తదాత అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర రోడ్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఉత్తమ రక్తదాత అవార్డు, ప్రశంసాపత్రాన్ని ఆయనకు అందజేశారు. 66సార్లు రక్తదానం చేయడం, స్వచ్ఛంద సేవ, రక్తదాన చైతన్య కార్యక్రమాలు నిర్వహించినందుకు అవార్డు ప్రకటించినట్లు రాధాకృష్ణారెడ్డి తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక రక్తదాతను తయారు చేయడమే లక్ష్యమన్నారు.

'బిల్డ్ ఎక్స్‌పో 2024' బ్రోచర్ ఆవిష్కరణ

సుభాష్‌నగర్, జూన్14: సెప్టెంబర్ 13,14,15వ తేదీలలో బిల్డ్ ఎక్స్‌పో 2024ను కరీంనగర్‌లోని వైశ్యభవన్‌లో నిర్వహించనున్నారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ కరీంనగర్ సెంటర్, అసోసియేషన్ ఆఫ్ కన్సల్టెంట్ సివిల్ ఇంజనీర్స్, ఆర్కిటెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా ఎక్స్‌పో బ్రోచర్‌ను ఏసిసిఈ ఛైర్మన్ ఈగల రాజేందర్, కెసీసీఈఎడబ్ల్యుఎ అధ్యక్షుడు మర్రి రాజేష్‌ల ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎసిసిఈ సెక్రెటరీ గడ్డం హరికిషన్, దూస సురేష్, ట్రెజరర్ పెద్ది ప్రమద్, సీనియర్ ఇంజనీర్లు కోల అన్నారెడ్డి పాల్గొన్నారు.

పెండోట సాహిత్య పురస్కారాలకు ఎంపిక

కరీంనగర్, జూన్ 14: సిద్దిపేటకు చెందిన శ్రీవాణి సాహిత్య పరిషత్ సంస్థ వారు 2023 సంవత్సరంలో ప్రచురించిన పుస్తకాలకు పెండోట సాహిత్య పురస్కారాలు అందజేయనుండగా, 9 పుస్తకాలు బాల సాహిత్య పురస్కారాలకు, 4 పుస్తకాలు సాహిత్య పురస్కారాలకు ఎంపికైనట్లు సంస్థ వ్యవస్థాపకుడు పెండోట వేంకటేశ్వర్లు శుక్రవారం ప్రకటించారు. రచయిత, భవానీ సాహిత్యవేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన 'బాలగేయ సారస్వతం పుస్తకం' బాల సాహిత్య పురస్కారానికి, తెలంగాణ రచయితల వేదిక ఉపాధ్యక్షుడు పెనుగొండ బసవేశ్వర్ రచించిన 'ప్రశ్నను మింగిన కాలం' పుస్తకానికి సాహిత్య పురస్కారం దక్కినట్లు వేంకటేశ్వర్లు వెల్లడించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చొప్పదండి, జూన్14: చొప్పదండి మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం పంపిణీ చేశారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గుర్రం నీరజ, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాహనాల తనిఖీలు

తిమ్మాపూర్, జూన్ 14: విద్యా సంస్థలు ప్రారంభం కావడంతో రవాణా శాఖ అధికారులు విద్యాసంస్థల బస్సుల తనిఖీలు ముమ్మరంగా చేశారు. మూడు రోజులుగా ఉదయం నుండి రాత్రి వరకు రవాణా శాఖ అధికారులు విద్యా సంస్థల బస్సులతో పాటు ఇతర వాహనాలను కూడా తనలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో 20 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు డిటిసి పురుషోత్తం తెలిపారు. ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న విద్యా సంస్థల బస్సులు 2, ప్రభుత్వనికి చెల్లించవల్సిన టాక్స్ చెల్లించకుండా నడుపుతున్న గూడ్స్ క్యారెజ్ వాహనాలు 10, ఇతర వాహనాలు 8 వాహనాలను పట్టుకొని వాటికి జరిమానా విధించనట్లు డీటీసీ పురుషోత్తం తెలిపారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 787 విద్యాసంస్థల బస్సులు ఉండగా అందులో శుక్రవారం నాటికి 611 బస్సులను ఫిట్‌నెస్ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నిర్వహించిన తనిఖీల్లో ఫిట్‌నెస్ లేకుండా, అనుమతి పత్రాలు లేకుండా నడిపిస్తున్న 15 వాహనాలను సీజ్ చేసినట్లు డీటీసీ పురుషోత్తం తెలిపారు. ఈ తనిఖీల్లో రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, జూన్ 14: ప్రభుత్వ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మూడు రంగాలు విజయవంతం కావాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేయడమే కాకుండా ఆగస్టు 15లోపు రూ. రెండు లక్షల రుణ మాఫీ చేయడానికి రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న గ్రామకార్యదర్శిని తొలగించాలని ఆయన ఆదేశించారు. ఎంపీపీ హరీష్ సభాధ్యక్షత వహించగా ఎంపీడీవో రాజేశ్వరీ, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● చొప్పదండి సహకార సంఘం సేవలు ఆదర్శనీయం

చొప్పదండి: చొప్పదండి ప్రాథమిక సహకార సంఘం సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం చొప్పదండిలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపును, పదిహేను లక్షల విలువ గల డ్రోన్, బ్యాటరి ఆటో, జనరేటర్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన చొప్పదండి ప్యాక్స్ ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలిచిందని సంఘం అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానన్నారు. రైతులకు రుణాలు అందించడంలోనూ సంఘం ముందుందని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెల్మ మల్లారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్, సంఘం మాజీ అధ్యక్షుడు గుంటి మల్లయ్య, కొమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, క్యాతం పురుషోత్తం, ఉపాధ్యక్షుడు ముద్దం మహేష్‌గౌడ్, డైరెక్టర్‌లు, సీఈవో, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి : కలెక్టర్

కరీంనగర్ టౌన్,జూన్ 14: ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. దన్‌ఘర్‌వాడీ ఉన్నత పాఠశాలలో మ్యూజిక్, డ్రాయింగ్, టైలరింగ్‌తో పాటు వివిధ అంశాల్లో శిక్షణ పొందిన విద్యార్థులతో శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై విద్యార్థులు ప్రత్యేక సారించాలని సూచించారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఎన్ని కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయవద్దని, ముందుకు సాగాలని సూచించారు. ఒడిదుడుకులను తట్టుకున్నప్పుడే విజయాలను ఈజీగా సాధించవచ్చని పేర్కొన్నారు. కలలకు ఎలాంటి అడ్డంకులు, ఆంక్షలు ఉండవని, వాటిని సాధించుకోవాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో 42 రోజులు ధన్గర్‌వాడీ పాఠశాలలో నిర్వహించిన శిక్షణ ద్వారా సంగీతం, చిత్రలేఖనం వంటి అదనపు బోధన తరగతులకు హాజరైన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు సంగీతం శిక్షణకు వంటి ప్రాధాన్యం ఇవ్వడం చాలా సంతోషం కలిగించిందన్నారు. జీవన ప్రయాణంలో ఎప్పుడూ ఏదో ఒక కొత్త విషయాన్ని గ్రహించాలని, ఎన్ని అడ్డంకులు, ఎదురైనా కలలను నిజం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు నేర్చుకున్న సంగీతాన్ని వినిపించడంతో పాటు వారు తయారు చేసిన పేపర్ పూలకుండీలు, డ్రాయింగ్స్ మొదలైనవి కలెక్టర్‌కు బహూకరించారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ పవన్‌కుమార్, కోర్స్ డైరెక్టర్ గొట్టే ప్రమోద, కోర్స్ ఇంచార్జి ఏనుగు ప్రబాకర్‌రావు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒడ్డెర కాలనీ పాఠశాలకు జీవం

● నాలుగు సంవత్సరాలుగా మూతపడ్డ పాఠశాల ప్రారంభం

భగత్‌నగర్, జూన్ 14: కొత్తపల్లి పట్టణ కేంద్రానికి ఆనుకుని ఉన్న ఒడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులు జీవం పోశారు. నాలుగు సంవత్సరాలుగా వసతులు లేని కారణంగా మూతపడ్డ పాఠశాల ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయంతో తెరుచుకున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూడ పడ్డ పాఠశాలలన్నింటినీ తెరవాలన్న సంకల్పానికి తోడుగా ఆ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కె వినోద, పులి పద్మలు ఒడ్డెర కాలనీలోని ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులను ఒప్పించి 30 మంది విద్యార్థులను పాఠశాలకు రప్పించారు. శుక్రవారం విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన పలకలు, నోట్‌బుక్స్ పెన్నులతో పాటు స్వీట్లు విద్యార్థులకు ఖాజీపూర్ గ్రామానికి చెందిన పి శంకర్‌గౌడ్ అందించారు. ఉపాధ్యాయులు పట్టుదలతో పాఠశాలలో విద్యార్థులను చేర్పించడం పట్ల విద్యాధికారి మధుసూదనాచారి, కొత్తపల్లి స్కూల్ కాంప్లెక్స్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటపద్మావతి హాజరై అభినందించారు.



విద్యార్థులకు సామగ్రి అందిస్తున్న ఉపాధ్యాయులు

బండి సంజయ్‌కు పలువురి అభినందన



తరుణ్‌చుగ్‌ను కలిసిన బండి సంజయ్



బండి సంజయ్‌ని కలిసిన ప్రవీణ్‌రావు

భగత్‌నగర్, జూన్ 14: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను ఢిల్లీలో పలువురు అభినందించారు. కరీంనగర్‌తో పాటు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు బండి సంజయ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు సంజయ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 2022 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు సంజయ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీలు సీతారాంనాయక్, బివి పాటిల్, మాజీ ఎమ్మెల్యేలు సంకినేని వెంకటేశ్వర్‌రావు, ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, బిసి కమిషన్ మాజీ సభ్యుడు టి ఆచారి, రాష్ట్ర అధికార ప్రతినిధులు ఎన్విసుభాష్, వీరేందర్‌గౌడ్, జెసం గప్ప, వివిధ మోర్చాలకు చెందిన నాయకులు సంజయ్‌ను కలిశారు. అదే విధంగా కరీంనగర్ బీజేపీ పార్లమెంట్ ఇన్‌చార్జి బోయినపల్లి ప్రవీణ్‌రావు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసి సత్కరించారు.

● ఢిల్లీలో కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం బండి సంజయ్ మర్యాదపూర్వంగా బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి తరుణ్‌చుగ్‌ను కలిశారు. ఈ సందర్భంగా తరుణ్‌చుగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విశ్వాసం కోల్పోయిందనడానికి పార్లమెంట్ ఎన్నికలే నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీకి బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయనే విషయం పార్లమెంట్ ఫలితాలతోనే రుజువైందన్నారు.

టీఎన్జీవోస్ నాయకులకు సన్మానం

సుభాష్‌నగర్, జూన్14: టీఎన్జీవోస్ రాష్ట్ర కమిటీలో నూతనంగా ఎన్నికైన నాయకులను టీఎస్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో సన్మానించారు. టీఎస్‌జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్యం ముజీబ్ హుస్సేన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కరీంనగర్ జిల్లాకు చెందిన గూడ ప్రభాకర్ రెడ్డిని కార్యదర్శిగా, రాగి శ్రీనివాస్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా టీఎస్‌జీఓ అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌రావులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నాగుల నర్సింహాచారి, బూత్కూరి శంకర్, సందీప్, ప్రవీణ్ , సుదర్శన్, శశిధర్, నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాలుగేళ్లలో రూ.499 కోట్లతో అభివృద్ధి పనులు

● మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జూన్ 14: తమ పాలకవర్గం కొలువుదీరిన నాలుగేళ్లలో రూ.499 కోట్ల విలువ చేసే వివిధ అభివృద్ధి పనులు 60 డివిజన్లలో పూర్తిచేశామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శుక్రవారం 13వ డివిజన్ రాంచంద్రాపూర్ కాలనీలో కార్పొరేటర్ చొప్పరి జయశ్రీవేణుతో కలిసి 13 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డునిర్మాణ పనులను ప్రారంభించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన వేయి కోట్ల నిధులతో నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని అన్నారు. అవే కాకుండా 152 కోట్లు మున్సిపల్ సాధారణ నిధులు, 347 కోట్ల ముఖ్యమంత్రి హామీ నిధులతో అభివృద్ధి పరుగులు పెట్టించామని అన్నారు. కొత్తకాలనీల్లో ప్రజల నుండి వస్తున్న డిమాండ్ల మేరకు ప్రాధాన్యతా క్రమంలో నిధులు వెచ్చించి అక్కడి సమస్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు. ప్రతిరోజు నగర ప్రజలకు మంచినీటిని అందించాలనే లక్ష్యంతో దాదాపు 133 కోట్లతో అందుకు అవసరమైన కార్యక్రమాలను పూర్తి చేసి రోజూ మంచినీటిని అందించామని అన్నారు. అయితే ఎల్‌ఎండీలో నీటి నిలువలు 5 టీఎంసీలకు చేరుకున్నందున రోజువిడిచి రోజు ఇస్తున్నామని, డ్యాంలోకి 10 టీఎంసీల నీరు వచ్చిన వెంటనే తిరిగి రోజు నల్లానీటిని అందిస్తామని మేయర్ సునీల్‌రావు ప్రకటించారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవడంతోపాటు డీఆర్‌ఎఫ్ టీంలను 24గంటలపాటు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామని, ఎక్కడ ఏ సమస్య వచ్చిన సమాచారమివ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలోఏ డీఈ ఓం ప్రకాశ్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

ఊటూర్ సొసైటీ చైర్మన్ తొలగింపు

మానకొండూర్, జూన్ 14: మానకొండూర్ మండలంలోని ఊటూర్ సహకార సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న ముద్దసాని ప్రదీప్‌రెడ్డిని అధ్యక్ష పదవి నుంచి తొలగించినట్లు కరీంనగర్ సహకార అధికారి రామానుజాచార్యులు ఉత్తర్వుల జారీ చేసినట్లు ఇన్‌చార్జి సీఈవో ఎడ్ల స్వామిరెడ్డి శుక్రవారం తెలిపారు. సహకార సంఘంలో రూ. 27లక్షల ఓవర్ డ్యూస్ వసూలు చేయడంలో సంఘం అధ్యక్షుడు నిర్లక్ష్యం వహించినందుకే అధ్యక్ష పదవి నుంచి తొలగించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దేవాలయం, జీపీ నిర్మాణంపై వివాదం

రామడుగు, జూన్ 14: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణం, జీపీ భవన నిర్మాణానికి సంబంధించిన దారి విషయంలో వివాదం చెలరేగింది. ఆలయ పునఃనిర్మాణం కోసం నేచర్ యూత్ క్లబ్, గ్రామస్తులు సమావేశమై నిర్మాణానికి ముందుకు వచ్చారు. కాగా మాజీ సర్పంచు కర్ర సత్యప్రసన్నరెడ్డి ఇంటి ముందు ఉండడంతో ఆలయం నిర్మిస్తే దాని నీడ తన ఇంటిపై పడి ఇబ్బందులు గురవుతామని ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై డీఎల్‌పీవో విచారణలో గ్రామస్థులు ఒకవైపు, మాజీ సర్పంచ్ ఒకవైపు ఉండడంతో వివాదం నెలకొంది. కలెక్టర్ ప్రత్యేక చొరువ తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

సైదాపూర్, జూన్ 14: సైదాపూర్ మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బండారి గట్టయ్య తల్లి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను శుక్రవారం జాగీర్‌పల్లిలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య తదితరులు ఉన్నారు.

అన్ని దానాల కన్నా రక్తదానం చాలా గొప్పది



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్, జూన్ 14: అన్ని దానాల కన్నా రక్తదానం చాలా గొప్పదని జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా స్థానిక జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో కరీంనగర్‌లోని ప్రతిమ వైద్య కళాశాల ఆధ్వర్యంలో జ్యోతిష్మతి ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. కళాశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు సుమారు 660 మంది పాల్గొని 52 యూనిట్ల రక్తం ఇవ్వడం జరిగిందని తెలిపారు. రక్తదానం చేసిన విద్యార్థులను చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.రావు, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్స్ రాజ్ కుమార్, జగదీశ్వర్, దినేష్, అధ్యాపకులు, విద్యార్థులు, వైద్యా సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ నాయకులు

హుజూరాబాద్/తిమ్మాపూర్/చిగురుమామిడి జూన్ 14: ఢిల్లీలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని బీజేపీ మండల అధ్యక్షులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఢిల్లీలో కలిసిన వారిలో జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్, హుజురాబాద్ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, వివిధ మండలాల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరచారి, కందుల శ్రీనివాస్‌రెడ్డి, రాపాక ప్రవీణ్, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, పైడిపల్లి శ్రీనివాస్, కట్కూరి అశోక్ రెడ్డి, పాల్గొన్నారు.



బండి సంజయ్‌ని సన్మానిస్తున్న నాయకులు

సెలవులో మున్సిపల్ కమిషనర్

కరీంనగర్ టౌన్, జూన్14: కరీంనగర్ నగర పాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ 15 రోజుల పాటు సెలవుపెట్టి వెళ్లిపోయారు. వ్యక్తిగతకారణాల వల్ల సెలవుపై వెళ్లిన ఆయన బాధ్యతలను అదనపు కమిషనర్ స్వరూపారాణికి అప్పగించారు. నగరపాలక సంస్థకు చెందిన పారిశుధ్య కార్మికుడు హన్మంతు గత కొద్ది రోజులుగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా తరచూ గైర్హాజరు అవుతున్నందున నగరపాలకసంస్థ కమిషనర్‌బోనగిరి శ్రీనివాస్ ఆయనను సస్పెండ్ చేశారు.

మంత్రిపై తప్పుడు ఆరోపణలు

కరీంనగర్ అర్బన్, జూన్ 14 : ఎన్‌టీపీసీ బూడిద రవాణా విషయంలో మంత్రిపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నాడని కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండీ తాజొద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి గతంలో ఒక ఎస్టీ మహిళకు ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేశాడని తాజొద్దీన్ ఆరోపించారు.

నియామకం

కరీంనగర్ అర్బన్, జూన్ 14 : యువజనకాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శిగా హౌజింగ్‌బోర్డు కాలనీ 7వ డివిజన్‌కు చెందిన ఎండీ సూఫియన్‌ను నియా మకం చేస్తూ యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా షోషల్‌మీడియా కో ఆర్డినేటర్ ఎండీ అమీర్ నియామక పత్రాన్ని సూఫియన్‌కు అందజేశారు.

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, జూన్ 14: గత నెల 3న ప్రమాదవశాత్తు వేడినీళ్లు ఒంటిపై పడి తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న జ్యోతినగర్‌కు చెందిన కమటం వెంకటేశం(74) శుక్రవారం మృతి చెందాడని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. మృతుడి భార్య శారద ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలో ఎల్ఈడీ స్క్రీన్‌ల ఏర్పాటు

కరీంనగర్ రూరల్, జూన్14: మండలంలోని చెర్లబూత్కూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు బోధన చేసేందుకు ఎల్‌ఈడి టీవీలను ఏర్పాటు చేశారు. శుక్రవారం విద్యార్థులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు భారతి, మాజి సర్పంచ్ రమనారెడ్డి, కార్యదర్శి వహీద్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వసంత్‌కుమార్‌ను అభినందించిన సీపీ

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 14: జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో ఇటీవల నిర్వహించిన పోలీస్ ఆన్యువల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు ఉత్సవాల్లో అద్భుత కరాటే ప్రదర్శన ఇచ్చిన ఓకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చీఫ్ కోచ్ కె.వసంత్‌కుమార్‌ను పోలీసు కమిషనర్ అభిషేక్ మొహంతి అభినందించారు. చీఫ్ ఇన్ స్ట్రక్టర్లు పుల్లూరి శ్రీనివాస్, బుర్ర ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలి

భగత్‌నగర్, జూన్ 14: చేగువేరా స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షు డు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. శుక్రవారం నగరం లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో చేగువేరా 96వ జయం తిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో చేగువేరా 96వ జయంతిని పురస్కరించుని ఏఐవైఎఫ్ చిత్రపటానికి పూలమాల వేశారు.

మంత్రిపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు

హుజూరాబాద్, జూన్ 14: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు, జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. రామగుండం నుంచి ఖమ్మంకు తరలిపోతున్న ఫ్లైయాష్ బూడిదకు, లారీల ఓవర్ లోడ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సంబంధం ఉందని ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. సమావేశంలో రాకేష్, ఆంజనేయులు, రామూర్తిగౌడ్, వెంకన్న, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

గంగాధర: గంగాధర మైనారిటీ కళాశాల ఇద్దరు విద్యార్థినిలు హెచ్‌సీఎల్ కంపెనీలో ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వారుణి తెలిపారు. కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన సింధూజ,శైలజలు హెచ్‌సీఎల్ కంపనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎంపికై ఉద్యోగం సాధించినట్లు ఆమె తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం వారిని కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో సన్మానించారు.

- జిల్లా మత్స పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్‌గా మండలంలోని ఆచంపల్లి గ్రామానికి చెందిన రేగుల రాజేందర్‌కుమార్ ఎన్నికైయ్యారు.

హుజూరాబాద్: బీఆర్‌ఎస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌పై సోషల్ మీడియాలో చేస్తున్న అనుచిత వ్యాఖ్యలపై శుక్రవారం కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ నాయకులపై ఏసీపీ శ్రీనివాస్‌జీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కొల్లూరి కిరణ్, సొల్లు బాబు, తిరుపతి, శంక ర్, మహేందర్‌గౌడ్, బాబు, చల్లూరి పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని పచ్చునూర్‌లో పెద్దమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన జాతరలో ముదిరాజ్ కులస్తులతో పాటు గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు.

శంకరపట్నం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ వెంటనే చేసి అర్హులకు కొత్త రుణాలు మంజూరు చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కేశవపట్నం కేడీసీసీ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

- శంకరపట్నం మండలం ఎరడపల్లిలో గాజుల మమత అదే గ్రామానికి చెందని కనకం రత్నాకర్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. అప్పటి నుంచి మమత కుటుంబ సభ్యులు ఆమె అత్తింటి వారికి వెళ్లకుండా ఇటుకలు అడ్డుగా పేర్చారు. సీసీ రోడ్డుకు అడ్డుగా పేర్చిన సిమెంట్ ఇటుకలు తొలగించి, దారికి ఉన్న అడ్డంకి తొలగించాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

వీణవంక: నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన మొహ్మద్ సజ్జద్‌ను మండలంలోని చల్లూరులో మైనార్టీ నాయకులు సన్మానించారు.

గణేశ్‌నగర్: జిల్లాలో కొన్ని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని కరీంనగర్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాయితోజు బ్రహ్మచారి ఆందోళన వ్యక్తం చేశారు.

గన్నేరువరం: మండలంలోని పారువెల్లలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎంపీటీసీ ఏలేటి స్వప్న చంద్రారెడ్డి తదితరులు పాఠ్యపుస్తకాలు, దుస్తులను అందజేశారు.

మానకొండూర్: మానకొండూర్‌లోని రెండు దాబాలలో మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు శుక్రవారం రాత్రి స్థానిక పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరు యజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.